ప్రజాశక్తి
ఆదివారం 21 మే 2023
5

కలెక్టరేట్‌ను సందర్శించిన
విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి -పాడేరు: రెండు రోజులు అల్లూరి సీతా రామరాజు జిల్లా పర్యటనలో భాగంగా విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారం జిల్లా కలక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. సమావేశ మందిరం, వీడియో కాన్ఫరెన్స్ హాలు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ చాంబర్ను పరిశీలించి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్‌లతో విద్యా కార్యక్రమాల అమలుపై చర్చించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఫోటోలు దిగారు.అంతకు ముందు చింతపల్లి, జి.మాడుగుల మండలాలలో పర్యటించి నాడు నేడు పనులు, జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్లు పరిశీలించారు.

కలెక్టర్, జెసి, పిఒలతో ప్రవీణ్‌ప్రకాష్

చర్చలు విఫలం

కొనసాగిన పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆసుపత్రిలలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం చేయాలని కాంట్రాక్ట్ నారాయణ రావుతో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ తో శనివారం పాడేరు ఆసుపత్రి ఎదురుగా సమ్మె చేస్తున్న ఆవరణలో సుమారు 8 అంశాల పైన చర్చలు జరిగాయి. జీతాలు పెంపు, పాడేరు, అరకులో ఒక విధానం, ముంచంగిపుట్టు, చింతపల్లిలో మరొక విధానంలో జీతభత్యాల్లో వ్యత్యాసం చూపిస్తున్నారని కార్మికులు, సిఐటియు నేతలు తెలిపారు. పిఎఫ్ డబ్బులు సక్రమంగా జమ కాలేదని రెండు డిమాండ్లతో జరిగిన చర్చలు ఆగిపోయాయని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు.

రెండవ రోజు సమ్మె జరుగుతుందని చిన్నయ్య పడాల్ అన్నారు. చింతపల్లి, ముంచంగి పుట్, అరకు, పాడేరు, ఆస్పత్రుల కార్మికులు తమ సమస్యల పరిష్కారంపై కాంట్రాక్టు నుంచి ఎటువంటి స్పందన కానరాకపోవడంతో కార్మికులంతా సమ్మె చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు పాడేరు డివిజన్లోని నాలుగు ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల లో పనిచేస్తున్న సుమారు 56 మంది శానిటేషన్ కార్మికులు నేడు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టనున్నారు. ఆస్పత్రుల శానిటేషన్ కార్మికుల వేతన సమస్యల పరిష్కారం పై వైద్య విధాన పరిషత్ అధికారులు శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అనేకసార్లు కార్మికుల వేతన సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్ళమని చెప్పారు. సమ్మె నోటీస్ ఇచ్చినప్పుడు కూడా అధికారులకు విన్నవించామని అయినా స్పందన కరువైందన్నారు. జీవో ప్రకారం ప్రతి కార్మికుడికి నెలకు 16 వేల రూపాయలు వేతనం చెల్లించాలని కానీ కొన్ని ఆసుపత్రుల్లో కార్మికులకు 10,700 మరికొన్ని ఆసుపత్రుల్లో 9,500 చొప్పున చెల్లిస్తున్నారని తెలిపారు. పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. నేటి నుంచి కార్మికులు చేపడుతున్న సమ్మెతోనైనా అధికారులు స్పందించి వారి వేతన సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ముఖ్యంగా కార్మికులకు కాంట్రాక్టు విధానం చేయాలని, వైద్య విధాన పరిషత్ ద్వారా జీతాలు చెల్లించాలని. ప్రతి ఆస్పత్రిలో సరిపడా సిబ్బందిని నియమించి కార్మికులపై పని భారం పని ఒత్తిడి తొలగించాలని డిమాండ్ చేశారు, 2019 నుంచి కార్మికుల జీతాలు పెంచలేదని, ఈ నాలుగేళ్లలో అన్ని నిత్యవసర ధరలు రెట్టింపు అయ్యాయని దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతి కార్మికుడికి నెలకు 16000 జీతం చెల్లించాలని ప్రతినెల సక్రమంగా వేతనాలు చెల్లించాలని కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సుందరరావు, కార్మికులు ముత్యాలమ్మ, రఘు, రామారావు, సుబ్బలక్ష్మి, ఘటి, సింహాచలం, శివ, నగేష్ పాల్గొన్నారు.

అరకులో నినాదాలు చేస్తున్న కార్మికులు



ముంచంగిపుట్టులో....

పాడేరులో మాట్లాడుతున్న సిఐటియు నేత చిన్నయ్యపడాల్

సమస్యలు పరిష్కరించాలి

అరకులోయరూరల్: అరకు ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ అరకు ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజు కొనసాగింది. కార్మికులు చేస్తున్న సమ్మెకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బి పోతురాజు, సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు మద్దతు తెలిపారు. ఈ సంధర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ: 26000 చెల్లించాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో సరిపడ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలన్నారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి, వైద్య విధాన పరషత్ ద్వారా జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. జీతంతో కూడిన సెలవులు మంజూరు చేసి, యూనిఫాం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేషియల్ యాఫ్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై గతంలో ఐటిడిఏ పిఒ, జిల్లా కలెక్టర్‌కు అనేక సార్లు వినతి పత్రం అందజేసినా స్పందించ లేదని, దీంతో విధులను బహిష్కరించి కార్మికులు సమ్మె చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పారిశుద్ధ కార్మిక సంఘం నాయకులు మోహన్, ద్రౌపతి, కృప, సూర్య, బాలన్న, పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన దీక్షలకు గిరిజన సంఘం జిల్లా కోశాధికారి కె.నర్సయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించి, కాంట్రాక్టు విధానం రద్దు చేయాలన్నారు. జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, యూనిఫాం, సేఫ్టి పరికరాలు అందించాలన్నారు. పేషియల్ యాఫ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై వెంటనే వైద్య శాఖాధికారులు తక్షణమే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు జీ.నారాయణ, కె,కొండయ్య పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగవంతం

జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: భూ హక్కు పత్రాలు పంపిణీకి భూముల రీ సర్వే వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ తహశీల్దారులు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో భూముల రీసర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముసాయిదా భూముల రిజిష్టరు పూర్తి చేసి 13 నోటిఫికేషన్ జారీ చేయలని సూచించారు. రీ సర్వే, వెక్టరైజేషన్, డేటా ఎంట్రీ ప్రక్రియలకు లక్ష్యాలు నిర్దేశించుకుని ఆ దిశగా పనులు గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేసారు. జిల్లా వ్యాప్తంగా 2676 గ్రామాలకు సర్వే చేయడానికి లక్ష్యాలను నిర్దేశించగా ఇప్పటి వరకు 637 గ్రామాలలో 2 లక్షల 56 వేల 488 ఎకరాల భూములను సర్వే పూర్తి చేసారని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వే వేగంగా పూర్తి చేసి గ్రామ సర్వేయర్లు డేటా ఎంట్రీ, విఆర్ఓలు డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూముల క్లాసిఫికేషన్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మ్యుటేషన్ ప్రక్రియలు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో సర్వే సహాయ సంచాలకులు వై.మోహనరావు, సర్వే ఇన్స్పెక్టర్ ఎస్.నాగేశ్వరరావు, 11 మండలాల తహశీల్దారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి శివశ్రీనివాసు

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

శిరమయ్యకు ఘననివాళులర్పించిన సిపిఎం నేతలు

శిరమయ్య స్థూపానికి నివాళులర్పిస్తున్న ముత్తమ్మ

ప్రజాశక్తి-విఆర్.పురం : అమరవీరుల ఆశయసాధనకు కృషి చేయడమే వారికిచ్చే ఘనమైన నివాళిఅని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం మండలంలోని స్వగ్రామం గ్రామంలోని చిన్నమట్టపల్లిలో కారం శిరమయ్య రెండో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్థూపానికి శిరమయ్య సతీమణి ముత్తమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎంపిపి కారం లక్ష్మి ఆవిష్కరించి, జోహార్లర్పించారు. అనంతరం సిపిఎం కార్యాలయంలో కారం శిరమయ్య చిత్రపటానికి జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం. చిన్న బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాజీ సర్పంచ్ కుంజ నాగిరెడ్డి మాట్లాడుతూ శిరమయ్య నిజాయితీ, నిడాంబరత, వారి త్యాగశీలతను నేటి, రేపటి తరాలకు చాటి చెపుదామని పిలుపునిచ్చారు. అమరజీవి శిరమయ్య స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలన్నారు.

నేడు ఏజెన్సీ గ్రామాల్లో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది సిపిఎం మాజీ ఎంపీపీ శరణమయ్య ఎమ్మెల్యేలుగా కుంజ బుజ్జి, సున్నం రాజయ్యవంటి వారు చట్టసభల్లోనూ, బయట చేసిన పోరాట ఫలితమేనన్నారు. మన్యవాసులకు సౌకర్యాల కల్పనకు, సమస్యల పరిష్కారానికి తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టిపేఎ్రజెండా నీడన పోరాటం చేశారన్నారు. వారి ఆశయసాధనకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేసిన నాడే గిరిజనులకు హక్కులు, అధికారం సాకారమౌతుందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, అచ్యుతరావు, కాంతారావు, వడ్లది రమేష్,. సున్నం నాగమ్మ, సోడి నాగేశ్వరరావు, పండ వెంకటేశ్వర్లు, కనకమహాలక్ష్మి, లీలావతి, గుండి పొడి లక్ష్మణరావు, సత్యనారాయణ, కారం. సత్తిబాబు, బుజ్జి, ప్రకాశరావు పాల్గొన్నారు..

పార్టీ జెండానువిష్కరిస్తున్న ఎంపిపి లక్ష్మి

గిరిజనులకు చేదోడుగా స్వేచ్ఛ సొసైటీ సేవలు

గిరిజనులకు దుస్తులు అందజేస్తున్న డాక్టర్ స్వాతి

ప్రజాశక్తి - రంపచోడవరం : మన్యవాసులకు చేదోడువాదోడుగా ఉండి, వారి అవసరాలను తీర్చడమే కాకుండా, సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ ప్రతినిధి డాక్టర్ కంటా స్వాతి వెల్లడించారు. రంపచోడవరం మండలం ఆకూరు పంచాయతీ కింటుకురు గ్రామంలో పర్యటించారు. అక్కడ గిరిజనులకు బట్టలు నిత్యవసరసరుకులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మెడిసిన్, సోలార్ లైట్లు, పిల్లలకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రంపచోడవరం ఐటిడిఎకు చేరువలో ఉన్న గ్రామాలలోని గిరిజనుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, మారుమూల గ్రామాల్లోని ప్రజల దుస్థితిని తలచుకుంటేనే ఆందోళన కలుగుతోందన్నారు. రంపచోడవరం నుంచి మూడుకిలోమీటర్లు దూరం కాలినడకన ఒక్కరోజే రావడానికి ఇబ్బంది ఇలా ఉంటే, నిత్యం గిరిజనుల పరిస్థితి ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులు, ఎంత అవస్థలు పడుతున్నారో తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు, తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు.

మాట్లాడుతున్న నాగరాజు

జంతు సంరక్షణ చట్టాలు అమలు చేయాలి
- డివిజనల్ పరిపాలనాధికారి నాగరాజు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: జంతు సంరక్షణ చట్టాలు పక్కాగా అమలు చేయాలని సబ్ కలెక్టర్ కార్యాలయం డివిజనల్ పరిపాలనాధికారి బి.నాగరాజు సూచించారు. ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశాల మేరకు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి జంతు సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో జంతు సంరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. జంతువుల అక్రమ రవాణా నియంత్రించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. 1960 జంతు సంరక్షణ చట్టం ప్రకారం జంతువుల అక్రమ రవాణా నిరోధించాలని చెప్పారు. 1920 చట్టం ప్రకారం కుక్కలను చంపకూడదన్నారు. పశువుల విక్రయాలకు అనుమతులు లేని సంతలను మూసి వేయాలని, చట్టాన్ని అతిక్రమించి మూగ జీవాల విక్రయాలు అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎపి గోసంరక్షణ సమాఖ్య గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ బండారు వెంకట రమణ, వైద్యాధికారులు, పోలీసు అధికారులు, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, తహశీల్దారులు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఉపాధి కూలీల వినతి

ప్రజాశక్తి-అనంతగిరి: ఉపాధి కూలీ లబ్ధిదారులకు కనీస కూలి రేటు అందే విధంగా సంబంధిత అధికారులు కషి చేయాలని ఎంపీపీ శెట్టి .నీలవేణి సూచించారు. శనివారం చిలకగెడ్డ పంచాయతీ పరిధి గ్రామంలో సందర్శించిన ఆమె పనులను పరిశీలించి కూలీలకు అందుతున్న ప్రేమెంట్లు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ, ప్రస్తుతం మండుటెండల్లో పనులు చేస్తున్నామని కనీస కూలి రేటు కూడా దక్క లేదని, రోజుకు రూ.120 నుండి 150లు వస్తున్నాయని తెలిపారు. పనిముట్లు అందించాలని పని ప్రదేశంలో మజ్జిగ, తాగునీరు, టెంటులో కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్క జాబ్ కార్డు కలిగి ఉన్న లబ్ధిదారులకు పని కల్పిస్తూ రోజు రూ. 250 అదేవిధంగా మస్తరు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కూలీలు తెలిపిన సమస్యలను సంబంధిత ఉపాధి హామీ జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి ఎంపీడీవో కుమార్, ఉపాధి హామీ ఎపిఒ అర్జున్, ఏవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు చెపుతున్న కూలీలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎ సమావేశపు మందిరంలో అన్ని మండలాల ఎంపిడిఒలు, డిఎల్‌డిఒలు, వెలుగు ఎపిడి, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు, ఇఒపిఆర్‌డిలు తదితరులతో డివిజనల్ ఫారెస్ట్ అధికారి, నోడల్ అధికారి జి జి. నరేంద్రన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ మనదేశంలోని పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం మేరీ లైవ్ మిషన్ లైవ్ ప్రోగ్రాం కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దీని ద్వారా ఈ నెల 18 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో తాగునీటి వృధాను అరికట్టడం, విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ వాడకం నిర్మూలన, సచివాలయాల పరిధిలో ఇంటింటా ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటడం, ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను తీసి ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని పిఒ ఆదేశించారు. హించడం అదేవిధంగా ఈ కార్యక్రమాలు నిర్వహించిన వాటిని ఎప్పటికప్పుడు ఫోటోలు తీసి మెసేజ్ చేయాలని సంబంధిత అధికారులను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు.

డివిజనల్ ఫారెస్ట్ అధికారి, నోడల్ అధికారి జిజి నరేందిరన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని, అందులో భాగంగా రంపచోడవరం డివిజన్‌లో 15 రకాల పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను అమలు చేయాల్సి ఉందన్నారు. ప్రతిపౌరుడూ దీనిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంత సందర్శనకు వచ్చే పర్యాటకుల సైతం దీనిపై అవగాహన కలిగి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు సహకరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం కార్యక్రమాల అమలుకు 'సేవ్' వెబ్‌సైట్‌ను రూపొందించామని, పదిమంది సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వాడకం నిషేధంపై ఎక్కడికక్కడ బ్యానర్లు ఏర్పాటు చేయాలని కోరారు. జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతిఒక్కరినీ భాగస్వాములను చేయడం ద్వారా ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా అందరితో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి వుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎడిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ అనూష వెలుగు ఎపిడి ఎ. శ్రీనివాస రావు, డిఎల్‌డిఒ కె. కోటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. డేవిడ్‌రాజ్. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ గోపిక, ఎంపిడిఒలు ఎంవిఆర్ కుమార్‌బాబు, మడకం బాపన్నదొర, ఇఒపిఆర్‌డిలు శ్రీనివాసరావు, జాన్ మిల్టన్, అశోక్ కుమార్, ఎస్‌ఒ మార్తమ్మ పాల్గొన్నారు.

అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తోన్న పిఒ సూరజ్ గనోరే

సిఫార్సులకు ఆస్కారం లేని సంక్షేమమే లక్ష్యం

గడపగడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -కొయ్యూరు : సిఫార్సులు లేకుండా సంక్షేమ ఫలాలను అందించిన ఏకైక ప్రభుత్వం వైసిపి మాత్రమేననిపాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు శనివారం మండలంలోని యు. చీడిపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని సంగంవలస, నక్కలమెట్ట, గంగవరం, యు.చీడిపాలెం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 189 ఇళ్లను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు రాని వివరాలను సేకరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్, సర్పంచ్ దీడాల రమేష్, ఎంపిటిసి టి. మాధవరావు, వైస్ ఎంపిపిలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, ఎఎంసి చైర్మన్ జైతి రాజులమ్మ, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, ఎంపిటిసి చడ్డ మల్లేశ్వరి, సీనియర్ నాయకులు సావిత్రి, గురుమూర్తి, సొన్ను, రీమెల గంగాధర్, శేఖర్, అంతిరెడ్డి శ్రీనివాస్, కే వెంకటరావు, కే కృష్ణంరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధంపై మండిపడ్డ టిడిపి నేతలు

మాట్లాడుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -చింతూరు : అధికారంలో ఉండి, ప్రజా సమస్యలను గాలికొదిలేసి విపక్ష నేతలపై దాడులు, విమర్శలు చేయడం, చంద్రబాబు వంటి నేతల దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ కాలయాపన చేయడంప వల్ల ప్రజలకు ఏం ప్రయోజనమని చింతూరు తెలుగుదేశం మండలాధ్యక్షులు జిల్లా చిన్నారెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రజాసంక్షేమాన్ని మానేసి విమర్శలతో కాలం గడిపేస్తున్నారని దుయ్యబట్టారు. శనివారం తెలుగుదేశం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీరు, రహదారులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతన్నారని,2022 జూలై, ఆగస్టు నెలల్లో వచ్చిన వరద బాధితులకు ఇంతవరకు నష్టపరిహారం అందించలేదని, పోలవరం నిరాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు ఇంకా సర్వేలు దాటలేదని, నిర్వాసిత ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు .ఇన్ని సమస్యలుంటే వాటన్నింటినీ గాలికొదిలేసి విపక్ష నేతలతో కాలం గడిపేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజధాని అమరావతిని శ్మశానంతో వైసిపి ముఖ్యనేతలే పోల్చి మాట్లాడినప్పుడు ఎమ్మెల్యే ధనలక్ష్మిని ఎందుక మాట్లాడలేదని ప్రశ్నించారు. ప్రజలు ఓట్లేసి అధికారం ఇచ్చింది వారికి సేవ చేయాలనే గానీ, ఇలా విపక్షాలపై దాడులు చేసేందుకు కాదని హితవు పలికారు. కార్యక్రమంలో తెలుగుదేశం చింతూరు మండల నాయకులు. మల్లెల్లి వెంకటేశ్వరరావు. రామారావు. ముత్యాల శ్రీరామ్. సురేష్ చౌదరి. గుర్రం ముత్తయ్య.సాల్మన్ రాజు పాల్గొన్నారు.

ఆడుతున్న విద్యార్థులు

స్కిప్పింగ్ పోటీలు

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:వేసవిలో చిన్నారులకు ఉపయోగకరంగా ఉండేందుకుగాను వేసవి విడిదిలో భాగంగా స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న చిన్నారుల ఆటల పోటీలు కొనసాగాన్నాయి. ఈ సందర్భంగా శనివారం గ్రంథాలయంలో స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 32 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎస్.సునీత, సిబ్బంది కే.సుబ్బారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్:2023-2024 విద్యా సంవత్స రమునకు గాను అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ పరిధిలో నడుపుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డుంబ్రిగుడ (బాలురు, బాలికలు), ముంచంగిపుట్టు (బాలురు, బాలికలు) జికె వీధి (బాలురు, బాలికలు)లలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశమునకు గాను 2022-23 విద్యా సంవత్సరములలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు %www.aptwgurukulam.ap.gov.in% వెబ్ సైట్‌లో పూర్తి చేసిన ధరఖాస్తులు ఈనెల 31వ తేదీ లోపు సమర్పించాలన్నారు. ఆన్లైన్లో బైపిసి, ఎంపిసి, హెచ్ఇసి గ్రూపులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కొరకు కన్వీనర్ ప్రిన్సిపాల్ (జికే వీధి) పోన్:9908595435, గురుకులం ఒఎస్‌డి ఫోన్ 9493758072నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

రాయితీపై డిప్ ఇరిగేషన్ పరికరాలు

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాన్ని సద్వినియోగించుకోవాలని మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ లక్ష్మి సూచించారు. శనివారం ఆమె మండలంలో ఎండపల్లి, బోడపాలెం, టి.జగ్గంపేట, కోటవురట్ల గ్రామాలకు ఇటీవల సరఫరా చేసిన డ్రిప్ ఇరిగేషన్ స్పింక్లర్ పరికరాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో, ఐదు ఎకరాల పైబడిన వారికి 50శాతం రాయితీతో రైతులకు అందజేస్తామన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 832 హెక్టార్లలో రైతులకు ఈ సౌకర్యం కల్పించాలని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్‌తో కూలీల సమస్య, కలుపు నివారణ, ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చు నన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఐఒ సత్యవేణి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి -నక్కపల్లి: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మండల ప్రత్యేక అధికారిణి రమామణి సూచించారు. శనివారం ఆమె మండలంలో పర్యటించారు. స్థానిక సిహెచ్‌సిని సందర్శించారు. రోగులతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ జనార్ధన్‌తో వైద్య సేవలపై మాట్లాడారు. అనంతరం ఆమె నక్కపల్లిలో జగనన్న కాలనీ సందర్శించారు. గృహ నిర్మాణాలను పరిశీలించారు. వేగవంతంగా గృహ నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసారు. నక్కపల్లిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.తహసీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం పై మండల స్థాయి అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నీరజ, ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ పాల్గొన్నారు.

గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా...

మెగా వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండల కేంద్రంలోని జూన్ 8,9 తేదీల్లో గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభల సందర్భంగా మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఉపాధ్యక్షులు పి సూర్యనారాయణ, నాయకులు కె.మగ్గన్న తెలిపారు. శనివారం అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంత పోరాటాల పురిటిగడ్డ అరకులోయలో గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో యువతకు భాగస్వామ్యం చేయాలని భావిస్తూ మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజన యువత చదువుతోపాటు క్రీడల్లో అంతర్భాగం కావాలని శారీరక, మానసిక ఉల్లాసం ఉండడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆసక్తి ఉన్న వాలీబాల్ క్రీడాకారులు తమ జట్టు పేరును ఈనెల 21 నుండి 26 తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. ఒక జట్టు ఎంట్రీ ఫీజు 1500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. నమోదుకు టి.సూర్యనారాయణ, కె.మగ్గన్న ఫోన్: 7989488058, 9490679179 నంబర్లకు సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

మోదకొండమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పెదబయలు:మండల కేంద్రంలో ఈనెల 28 నుండి 30 వరకు నిర్వహించే మోదకొండమ్మ జాతర నేపద్యంలో ఉత్సవ కమిటీ ఛైర్మెన్ మజ్జి చంద్రుబాబు ఆధ్వర్యాన అరకు శాసన సభ్యులు శెట్టి ఫాల్గుణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం శాసన సభ్యులు మాట్లాడుతూ, మూడురోజుల పాటు నిర్వహించే పండుగకు అన్ని వర్గాల ప్రజలు సహకరిస్తుండటం సంతోషకరమన్నారు. జాతర మూడురోజుల పాటు విద్యుత్, మంచినీరు ఏర్పాట్లపై భక్తుల సహకారం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి.మాధవరావు, ఎంపీటీసీ కె.బొంజుబాబు, ఉత్సవ కమిటీ గౌరవ సభ్యులు గంపరాయి సూరయ్య, చిన్నయ్య మాస్టారు, వైస్సార్సీపీ నాయకులు పాంగి సింహాచలం, కనకరాజు, జగత్‌రాయ్, బొండా సన్నిబాబు, సిహెచ్ రవిశంకర్, సర్పంచ్, వర్తక సంఘం అధ్యక్షులు చిన్ని భాస్కర్, విఆర్ఓ సిహెచ్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

రికాప్రజాశక్తి- పెదబయలు రూరల్:మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రజా పరిషత్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి సత్యనారాయణ శనివారం సందర్శించారు. కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది తో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పలు రికార్డులను తనిఖీ చేసారు. నిర్మాణ దశలో ఉన్న నూతన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు.అసంపూర్తిగా ఉన్న భవనం పూర్తి చేయుటకు కావలసిన గ్రాంట్‌కు సంబంధించి ఎస్టిమేట్లు తయారు చేసి పంపాలని ఆదేశించారు.సీకరీ గ్రామంలో జిల్లా ప్రజా పరిషత్ నిధుల నుండి నిర్మించిన సిసి రోడ్లు, ప్రధాన రహదారికి సపోర్టింగ్ వాల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణయ్య, మండల ఇంజనీరింగ్ అధికారి ఎస్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి సత్యనారాయణ

తెగిపడిన విద్యుత్ తీగలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని పట్టాం పంచాయతీ ఆమనగిరి గెడ్డ పక్కన కొండల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో 3 విద్యుత్ స్తంభాల తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో ఏవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ ఉత్పత్తి నిలిచి పోవడంతో పలు గ్రామాల గిరిజనులు అవస్థలు పడ్డారు.

మహిళకు గాయాలు

పజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామానికి చెందిన కొర్ర భూమిక శుక్రవారం రాత్రి గృహ పరిసరాలను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగ తగలడంతో గాయాలయ్యాయి. ఆమెను కుటుంబ సభ్యులు అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలుసుకున్న గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్, ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజులు హాస్పిటల్‌లో ఆమెను పరామర్శించారు.

నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులకు సీఎం బటన్ నొక్కి విడుదల చేయాలని తెలుగు యువత మండల అధ్యక్షులు తిరుమలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, ఏళ్ల తరబడి అసంపూర్తిగా దర్శనమిస్తున్న జల్లూరు, పందూరు వంతెనల నిర్మాణాలతో పాటు గిరిజన గ్రామాలైన కోదండరామపురం, తడపర్తి రోడ్డు నిర్మాణాలకు నిధులను ముఖ్యమంత్రి బటన్ నొక్కి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా వదిలేసిన వంటి వంతెనల కారణంగా మండల, డివిజన్ వ్యాప్తంగా ప్రయాణికులు, ప్రధానంగా విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు.గిరిజన గ్రామాలైన కోదండరామపురం, తడపర్తి రోడ్డు నిర్మాణాల పనులు పూర్తి చేయాలని, తక్షణమే వీటి నిర్మాణాలకు నిధులు విడుదల చేసి పూర్తి చేయాలని తెలిపారు.

ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో పిట్లపాలెం, రేవుపోలవరం, పెద్దఉప్పలం గ్రామాలలో ఉపాధి హామీ పనులను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యమ్ సత్యనారాయణ పరిశీలించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మట్లాడుతూ, వ్యవసాయ పనులు లేని సమయంలో రైతు కూలీలకు ఉపాధి హామీ చట్టం ఎంతగానో ఆర్థికంగా కాపాడుతుందన్నారు. ఎండా కాలంలో ఏ పనులు దొరకక వ్యవసాయ కూలీలు మొదలు కొని డిగ్రీ చదువుకున్న యువతీ, యువకుల ఉపాధి పనులకు వెళుతున్నారన్నారు.ఇటువంటి చట్టానికి మరింతగా నిధులు పెంచి అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని ఎత్తివేసి కూలీలు పొట్ట కొట్టాలని చూస్తుందన్నారు. ఒక్క సారే ఈ చట్టాన్ని రద్దు చేస్తే కూలీలు తిరగబడతారనే భయంతో అనేక షరతులు పెడుతుందన్నారు. ఒక పూటకు బదులు రెండు పూటలూ పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, సమ్మర్ అలవన్స్ రద్దు చేశారన్నారు. ఆన్లైన్ మస్తర్లు పెట్టి పేదలను ఇబ్బంది పెడుతున్నారని, పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేయాలని కేంద్రం చూస్తోందని విమర్శించారు.కూలీలకు కిటాయించిన నిధులను సిమెంట్ రోడ్లకు, సచివాలయాల భవనాలకు మెటీరియల్ చార్జీలు పెరు చెప్పి రాష్ట్ర ప్రభుత్వ వాడుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిదుల్లో ఎలవెన్స్ లు కలిపి ఇవ్వవలసిన రాష్ట్ర ప్రభుత్వం వాటిలో నిదులను వాడుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నర్సీపట్నంటౌన్: అమలాపురం గ్రామంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర నిర్వహించారు. చెరువులో పని చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూలీలు మండుటెండలో పని చేస్తున్నా కనీస వసతులు కూడా కల్పించలేదన్నారు. కూలీల పక్షాన తాము పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వేగిశెట్టి శ్రీను, పొలుపర్తి సూరిబాబు, మాకవరపాలెం జనసేన మండల నాయకులు సంతోష్, జన సైనికులు పాల్గొన్నారు.

కూలీల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ప్రజాశక్తి పాయకరావుపేట:ఉపాధి హామీ కూలీలతో కలిసి మండుటెండలో శనివారం ఎమ్మెల్యే గొల్ల బాబురావు పని చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తమకు టెంట్లు ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు.మంచినీళ్ల ఏర్పాటు చేసి, కూలీ పెంచాలని పేర్కొన్నారు. స్పందించిన గొల్ల బాబురావు పంచాయతీరాజ్ కమిషనర్ తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుల మతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందే విధంగా చర్యలు తీసుకుంటే కొంతమంది ప్రతిపక్షాలు వారు విమర్శలు గుప్పిస్తున్నారని వారు ఎంత విమర్శలు చేస్తే జగన్మోహన్ రెడ్డికి అన్ని దీవెనలని మళ్లీ ఈ రాష్ట్రాన్ని ఏలేది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి -కోటవురట్ల: వివిధ సమస్యలపై స్పందనలో చేసుకున్న ఫిర్యాదులను తహసిల్దార్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేక అధికారి అరుణశ్రీ, తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక ఎస్సై నారాయణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. జల్లూరు గ్రామంలో సర్వే సమస్యపై చేసిన ఫిర్యాదును రెవెన్యూ అధికారులు పరిష్కరించగా, అన్నవరం గ్రామంలో ఇంటి వివాదం పై ఇరువురు అన్నదమ్ములు చేసుకున్న ఫిర్యాదును పరిశీలించారు. ఆ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీలేరు: క్రీడల్లో రాణించి నైపుణ్యాన్ని పెంచుకోవాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణ సూచించారు. శనివారం సీలేరు క్రికెట్ యువ క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ, యువత చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలని, క్రీడల్లో రాణిస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. యువత పెడదోవ పట్టకుండా, సన్మార్గంలో పయనించి, తమ భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. .యువతకు ఏ క్రీడలపై ఆసక్తి ఉంటే, ఆయా క్రీడల్లో రాణించాలంటే నిత్యం చిత్తశుద్ధి, పట్టుదలతో ప్రాక్టీస్ చేయాలని సూచించారు.

22న వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని ఐ పోలవరం గ్రామ సమీపంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఈనెల 22న ఉదయం 9.30గంటలకు ప్రారంభించనున్నారు. ఈ మేకు ఆలయ ప్రారంభోత్సవానికి తరలిరావాలంటూ టీడీపీ ప్రచార రథం ఏజెన్సీలోని ఊరూరా పర్యటిస్తూ, ప్రజలను ఆహ్వానిస్తోందని తిరుమల తిరుపతి దేవస్థానం జనరల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి గుణ భూషణ రెడ్డి తెలిపారు

పోటీలను ప్రారంభిస్తున్న శివప్రసాద్

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యూరు : డౌనూరులో బోడకొండమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్‌ను నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కుసిరెడ్డి శివప్రసాద్, అమ్మహాస్పిటల్ డాక్టర్ రాజు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌టి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ధనర్జన్ జాయింట్ సెక్రెటరీ ధర్మరాజు ఆర్గనైజింగ్ సెక్రటరీ పంతులు బాబు, స్థానిక ఎంపిటిసి బిడిజాన అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బోనంగి ప్రసాదు మాస్టర్, ఉత్సవ కమిటీ ఆర్గనైజర్స్ సురేష్ పట్నాయక్, రాజుపాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై అవగాహన

ప్రజాశక్తి -కొయ్యూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కేడీపేట అటవీ రేంజ్ పరిధిలోని పలు గ్రామాలలో స్థానిక రేంజర్ జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యుత్ పొదుపు, నీటి వృథాను నివారించడం, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం, భూగర్భజలాలు పెంపొందించే చర్యలు చేపట్టడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు కార్యక్రమంలో కెడి.పేట రేంజర్ రాజేష్, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

గుబేలుపేటలో తాగునీటికి కటకట

నెలరోజులుగా అంధకారంలో మగ్గుతున్న జనం

ప్రజాశక్తి - చింతూరు. : చింతూరు మండల కేంద్రంలోని సినిమా హాల్ వెనుక బజారు గుబేలు పేటలో ప్రజలు వారం రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఒకవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు బిందెడునీటికోసం ఇతర వీధులు, ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వారంతా వాపోతున్నారు. పంచాయతీ కుళాయిల ద్వారా వారం రోజులుగా నీరు అందించకపోవడంతో ప్రజలు అలమటిస్తున్నారు. వేసవిలో నీటి ఇక్కట్లుపై ఆవేదన చెందుతూనే, మండల కేంద్రంలోనే సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. మరోవైపు గుబేల్‌పేట ప్రజలు నెలల తరబడి అంధకారంలోనే మగ్గుతున్నారు. వీధిలైట్లు వెలగక నెలలు తరబడి చీకట్లోనే ప్రజలు మగ్గుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వీధిలైట్లు ఏర్పాటుతోపాటుత్రాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారించండి

వారం రోజులుగా పంచాయతీ కుళాయిల ద్వారా నీళ్లు రావడం లేదు. జీవనోపాధికి వారపుసంతకు వెళ్లే తామంతా తిరిగి ఇంటికొచ్చేసరికి తాగేందుకు నీరు లేని పరిస్థితి ఉంది. నీటికోసం పనులు మానుకుంటే, పూట గడవడం కష్టమౌతోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి నీటి ఎద్దడి నివారించాలి.వీధిదీపాలు ఏర్పాటు చేయాలి.

-ఎ.అన్నపూర్ణ, గుబేలుపేట

నేడు ఎల్ఐసి ఏజెంట్స్ జోనల్ మహాసభ

22, 23 తేదీల్లో అఖిల భారత మహాసభ
ముఖ్య అతిథిగా హాజరుకానున్న సిఐటియు జాతీయ అధ్యక్షులు హేమలత
వివరాలు వెల్లడించిన నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసిఎఒఐ) ఐదో జోనల్ మహాసభ ఆదివారం విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరగనుందని, అలాగే ఈ నెల 22, 23 తేదీల్లో ఆరో అఖిలభారత మహాసభలు కూడా విశాఖ నగరంలోనే జరుగుతాయని ఎల్ఐసిఎఒఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ దిలీప్, జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ, నరసింహారావు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, టాగూర్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ మహాసభల సందర్భంగా ఈ నెల 22న ఉదయం 11 గంటలకు ఎల్ఐసి ప్రధాన కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతాయన్నారు. ఈ సభలలో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, కార్యదర్శి ఉమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తదితరులు పాల్గొంటారన్నారు. ఎల్ఐసిఎఒఐ ఉపాధ్యక్షులు ఎల్.మంజునాథ్ ఈ సభకు అధ్యక్షత వహిస్తారన్నారు. సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు స్వాగతం పలుకుతారని, డాక్టర్ హేమలత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు మహిళా సదస్సు ఉంటుందన్నారు. సదస్సులో 150 మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2.45 గంటలకు జరిగే ప్రతినిధుల సభలో భారతదేశం నలుమూలల నుంచి లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 500 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో 'నేటి దేశ ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ విధానాలు, ఎల్ఐసి పెట్టుబడి ప్రణాళికలు'పై చర్చ జరుగుతుందన్నారు. అందులో ఎల్ఐసి వాటాల విక్రయంపై కూడా చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగాన్ని, బ్యాంకులను రక్షించడంతోపాటు ఎల్ఐసిని రక్షించే కార్యక్రమాలు రూపొందిస్తారన్నారు. ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలు, సంస్థ నాశనానికి దారితీసే అంశాలపై క్రియాశీల చర్చ జరుగుతుందని తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయాలనే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి తమ యూనియన్ సంఘీభావం తెలియజేస్తుందన్నారు. సభలను జయప్రదం చేయాలని కోరారు.

యువతి దారుణ హత్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శనివారం ఉదయం విశాఖ నగరంలోని బీచ్ రోడ్డులో యువతిని ప్రియుడు దారుణంగా హత్యచేశాడు. అతడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. కేసు వివరాలను విశాఖ నగర డిసిపి - 1 (లా అండ్ ఆర్డర్) విద్యాసాగర్ నాయుడు సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం మేరకు విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతానికి చెందిన శ్రావణి నగరంలోని జగదాంబ సెంటర్ ప్రాంతంలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తూ అక్కడే ఒక రూమ్ అద్దెకు తీసుకొని ఉంటోంది. ఆమెకు గతంలో వివాహం జరిగింది. భర్త నుంచి విడిపోయి రెండేళ్లుగా ఒంటరిగానే ఉంటోంది. గాజువాక ప్రాంతానికి చెందిన పెరంబుర్ గోపాల్ పాత పరిచయంతో ఆమెకు దగ్గరయ్యాడు. ఆరు నెలలుగా సన్నిహితంగా ఉంటున్నాడు. అదే సమయంలో గోపాల్ స్నేహితుడు వెంకటేష్‌తోనూ ఆమె సన్నిహితంగా ఉంటోంది. శుక్రవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట ప్రాంతంలో నోవాటెల్ సమీపంలో నిర్మాణం జరుగుతున్న ఓ భవనం వద్దకు ముగ్గురూ చేరుకున్నారు. అక్కడ వెంకటేష్‌ను వేచి ఉండమని చెప్పి గోపాల్, శ్రావణిలు కొంత దూరం వెళ్లారు. అక్కడ చాలా సేపు మాట్లాడుకున్న అనంతరం ఘర్షణ జరిగింది. మాటా మాటా పెరిగిన క్రమంలో గోపాల్ ఆమె గొంతు నులిమి చంపేశాడు. ఈ సంఘటనలో ఇప్పటికే శ్రావణి మొబైల్ పరిశీలించామని, ఆమె ఇరువురితోనూ సన్నిహితంగా ఉండడం వల్లే గోపాల్ ఈ హత్యకు పాల్పడ్డాడని డిసిపి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. కీలక నిందితునిగా ఉన్న గోపాల్ గాజువాక పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు చెప్పారు.

సాయం అందజేస్తున్న సాక్షి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండ

ప్రజాశక్తి - అడ్డతీగల : మండలంలోని తిమ్మాపురం గ్రామం వాల్మీకి పేటలోని అగ్ని ప్రమాద బాధితులకు అడ్డతీగలకు చెందిన సాక్షి స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. ఈ ప్రమాదంలో రాజాల కన్నారావు, రూపులమ్మ, కొలిపే ముసలి గుర్రాజు, బొంకు జానబ్బాయ్, నూకాలమ్మ, వజ్రంగి బాబి, అప్పలకొండ, నాలుగు కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు సమాచారం తెలుసుకున్న సాక్షి స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు బాధితులకు బాసటగా నిలిచేందుకు ముందుకు వచ్చి, అడ్డతీగలకు చెందిన సాక్షి స్వచ్ఛంద సవా సంస్థ డైరెక్టర్ పి.ఆరోగ్యరాజు ఆధ్వర్యంలో నాలుగు కుటుంబాలలోని ముగ్గురు పిల్లలకు నూతన వస్త్రాలు, ఆయా కుటుంబాలకు వంట పాత్రలను అందజేశారు. బాధిత కుటుంబాలకు భోజనాలను సమకూర్చి, వారితో కలిసి భోజనాలు చేసి ధైర్యాన్నిచారు.కార్యక్రమంలో సాక్షి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎస్తేరు ఆరోగ్యరాజు, కె ధర్మారెడ్డి, శ్యామ్, కాంతరాజు, బొడ్డు రాజు పాల్గొన్నారు.

ఎపిపి రమేష్‌బాబును సత్కరిస్తున్న మారేడుమిల్లి ఆదివాసీ నేతలు

మారేడుమిల్లిని సందర్శించిన తెలంగాణ హైకోర్టు ఎపిపి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఎపిపి, గిరిజన ప్రాంతానికి చెందిన పెనుబల్లి రమేష్‌బాబు శనివారం మారేడుమిల్లిలోని గంగాలమ్మను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు గిరిజన గ్రామాల్లో పర్యటించి ఇక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, .ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర పరిధిలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి, వారికి కోర్టులో అవసరమైన న్యాయసాయాన్ని అందించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామదేవత సమక్షంలో రమేష్‌బాబును అభినందించారు. ఆదివాసీ కోయ తెగకు చెందిన రమేష్‌బాబు ఈ స్థాయికి ఎదగడం అభినందనీయం, అందరికీ ఆదర్శప్రాయమని డాక్టర్ రాజ్‌కుమార్ రెడ్డి ప్రశంసించి, అభినందించారు. కార్యక్రమంలో పునెం ప్రదీప్, ఎంపిటిసి సున్నం చంద్రారావు, జెఎసి సభ్యులు కర్రి సన్యాసిరెడ్డి, మట్ల కృష్ణారెడ్డి, సాదల ప్రేమకుమార రెడ్డి, సర్పంచ్ కత్తుల రమణా రెడ్డి, కత్తుల రత్నా రెడ్డి.పాల్గొన్నారు.

23న ఎన్‌టిఆర్, కృష్ణ చిత్ర గీతాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 23న నటరత్న ఎన్‌టిఆర్, సూపర్‌స్టార్ కృష్ణ చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు భూషణ్ బ్రదర్స్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు బి.ఫణిభూషణ్ తెలిపారు. ఈ మేరకు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శనివారం డాబా గార్డెన్స్‌లో పారిశ్రామికవేత్త ఎం.వెంకటరావు తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఫణిభూషణ్ మాట్లాడుతూ ఎన్‌టి.రామారావు, కృష్ణల పుట్టిన రోజులు ఇదే నెలలో కావడమే కాకుండా భూషణ్ బ్రదర్స్ సంస్థ 31 వార్షికోత్సవం సందర్భంగా ఈ గీతాలాపన ఉంటుందన్నారు